# నియోజకవర్గంలో 6.98లక్షల ఓటర్లు..

- ఓటర్ల సంఖ్యలో మరోసారి 'శేర్'లింగంపల్లి
- నేడు 622 పోలింగ్ కేంద్రాలలో తుది ఓటరు జాబితా ప్రదర్శన



నియోజకవర్గ ఆర్వో కార్యాలయం

మియాపూర్, అక్టోబర్ 3 : ఎన్నికల సంఘం తాజాగా చేపట్టిన ఓటర్ల జాబితాలోనూ శేరిలింగంపల్లి నియోజకవర్గం మరోసారి పోటీలేనిదిగా నిరూపించుకున్నది. అత్యధిక ఓటర్ల సంఖ్యతో కొనసాగుతున్న ఈ నియోజకవర్గం తాజా తుది ఓటరు జాబితా విడుదల సందర్భంగా తన స్థానాన్ని నిలుపుకున్నది. అక్టోబరు 4న ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను ప్రదర్శించనున్న తరుణంలో ..శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,98,079 ఓటర్ల సంఖ్య నిర్ధారణయింది. ఇంతటి భారీ ఓటర్ల సంఖ్యలో ఈ నియోజకవర్గం యదావిధిగానే రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు నియోజకవర్గంలో తుది ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించేందుకు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. సవరణకు ముందు నియోజకవర్గంలో 6.64 లక్షల మేర ఓటర్లుండగా.. తాజాగా చేపట్టిన పలు ప్రత్యేక నమోదు శిబిరాల ద్వారా అదనంగా మరో 34 వేల మంది వరకు ఓటర్ల సంఖ్య పెరిగింది. అయితే ఎన్నికలలోగా నమోదుకు ఆన్‌లైన్ ద్వారా అవకాశం ఉన్న నేపథ్యంలో విడుదలయ్యే సప్లిమెంటరీ ఓటర్ల జాబితా సంఖ్య 7 లక్షల పై చిలుకుకు చేరుకునే అవకాశాలున్నాయి.

**నేడు అన్ని పోలింగ్ కేంద్రాలలో తుది ఓటర్ల జాబితా ప్రదర్శన..**

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో గడచిన రెండు నెలలుగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అధికారులు చేపట్టారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కాలనీలు, శని, ఆదివారాలలో ప్రత్యేక శిబిరాల ద్వారా నూతన ఓటర్ల నమోదు, చిరునామాల మార్పు, మృతి చెందిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. కాగా అలా అందిన నూతన ఓటర్లతో పాటు నియోజకవర్గ మార్పు తదితర దరఖాస్తులపై విచారణను పూర్తి చేసిన అధికారులు తుది ఓటరు జాబితాలో చోటుకు పంపారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గంలోని 197 లొకేషన్లలోని 622 పోలింగ్ కేంద్రాలలో తుది ఓటరు జాబితాను ప్రదర్శించనున్నారు. ప్రజలు తమ ఓటు వివరాలను తమకు సమీపంలోని పోలింగ్ బూత్‌లలో పరిశీలించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం.. నియోజకవర్గంలో 6,98,079 ఓటర్లు నిర్ధారణ కాగా.. అందులో పురుషులు 3,70,301 , మహిళలు 3,27,636 ఉండగా.. 142 ఇతరులున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పకడ్బందీగా చేపట్టిన జాబితా సవరణ ప్రక్రియకు ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి తగు స్పందన లభించటంతో నమోదు పరంగా నియోజకవర్గం అధిక ఓటర్ల పరంగా మరోమారు తన సత్తా చాటుకున్నది.

# కోట్లాది నిధులతో మౌలిక వసతుల కల్పన

**విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

**పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో విప్ గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు

మియాపూర్, అక్టోబర్ 3: రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గంగా పేరొందిన శేరిలింగంపల్లి అభివృద్ధి విషయంలో కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు విప్ అరెకపూడి గాంధీ అన్నారు. అభివృద్ధి విషయంలో స్వీయ పోటీతో మరింత ఛాలెంజింగ్‌గా ముందుకు సాగుతున్నామని, రాబోయే అయిదేండ్లలో మరింత పురోగతిని చూపిస్తామన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లో రూ. 2.30 కోట్లతో, హైదర్‌నగర్ డివిజన్‌లో రూ.73.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, అధికారులు, కాలనీవాసులతో కలిసి విప్ అరెకపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ.. ఐటీ పరిశ్రమలకు నెలవైన శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల తోడ్పాటుతో ఎంతో ఉన్నదన్నారు. కోట్లాది నిధులతో ఎస్‌ఆర్‌డీపీ నిధులతో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, లింక్ రహదారులను విస్తృతంగా నిర్మించామన్నారు. మెరుగైన రవాణా సౌకర్యం కోసం పక్కా అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీరు, పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్, కమ్యూనిటీహాళ్ల వంటివి కల్పించినట్లు విప్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల పార్టీ శ్రేణులు, మహిళా నేతలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**వివేకానందనగర్ డివిజన్‌లో..**

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లోని బ్లాక్ 33, 34లలో రూ.9 లక్షల సీడీపీ నిధులతో ఏర్పాటు చేసిన 70 సీసీ కెమెరాలను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, సీఐ క్రాంతి, మాజీ కార్పొరేటర్ రంగారావుతో కలిసి విప్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. వీటి ఏర్పాటుకు ప్రజలలో అవగాహనకు పోలీసు శాఖ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, భాస్కర్‌రావు, హరినాథ్, ఆంజనేయులు, లక్ష్మీనర్సయ్య, చంద్రమోహన్, శ్రావణి, విద్యాసాగర్, శివ, సంపత్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనలో రాజీలేదు

- గచ్చిబౌలిలో రూ. 8.25 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విప్ గాంధీ



నలగండ్లలో శంకుస్థాపన చేస్తున్న విప్ గాంధీ, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

కొండాపూర్, అక్టోబర్ 3 : ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడేది లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం ఆయన గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నలగండ్ల హుడా కాలనీలో రూ.7.65 కోట్లతో నిర్మించనున్న 1.5 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సాయిబాబాలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రజలు అన్ని విధాలుగా సంతోషంగా ఉండేలా ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని కాలనీలు, బస్తీల్లో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు, విద్యుత్, వీధి దీపాలు తదితరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

**గోపన్‌పల్లిలో రూ. 60లక్షలతో తాగునీటి పైపులైన్ పనులు..**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండా, నలగండ్ల అవంతిక హోమ్స్‌లో హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఆధ్వర్యంలో రూ.60లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైపులైన్ పనులకు ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాయిబాబాలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఇంటికి మంచినీరు చేరేలా మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రత్యేక పైపులైన్లను నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ అభిషేక్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల మద్దతు మీకే..




బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య వెస్ట్‌జోన్ ప్రతినిధులు విప్ అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బ్రాహ్మణ సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నందున విప్ గాంధీ ద్వారా సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ సంఘం డివిజన్‌ల భవనానికి తగు స్థలం కేటాయించాలని సంఘం ప్రతినిధులు విప్ గాంధీని కోరారు. రాబోయే ఎన్నికలలో తమ సంపూర్ణ మద్దతును అందిస్తామని సంఘం నేతలు పేర్కొన్నారు.

**– మియాపూర్, అక్టోబర్ 3**

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 3 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళకు నగరవాసుల నుంచి విశేష స్పందన వస్తుందని నిర్వహకులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన చేనేత, హస్తకళాకారుల ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిపారు. మేళకు విచ్చేసే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో పలువురి కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆధ్యాంతం ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో కిరణ్మయూరి కళా నిలయం గురువులు దేశరాజు కిరణ్మయి శిష్య బృందం మూషిక వాహన, బ్రహ్మాంజలి, నాట్యహేలా, భామాకలాపం, అదిగో అల్లదిగో, నమశ్శివాయతేయ్, శ్రీనగర లహరి, ఆలోకయే బాలకృష్ణన్, కందర్ప జనక, బేహాగ్, తిల్లాన అంశాలను తన్మయి, సంహ్నాత, రజని, లిఖిత, సహస్ర, జాహ్నవి, స్మృతి, సాత్విక, నిశిత, చరిష్మాలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించి అలరించారు.

## భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ

కొండాపూర్, అక్టోబర్ 3 : చందానగర్ డివిజన్ భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సుందరం, జనరల్ సెక్రటరీగా కృష్ణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా సందీప్, ట్రెజరర్‌గా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా రాఘవులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సామ శ్రీనివాస్, అడ్వైజర్‌లుగా లక్ష్మీకాంత్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## స్వచ్ఛతా హీ సేవా అభియాన్



మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం చందానగర్‌లోని సుమన్ జూనియర్, ఒకేషనల్ కళాశాల, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, వీడీ బజాజ్ డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛతా హీ సేవా అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

**– కొండాపూర్, అక్టోబర్ 3**